క్లుప్తంగా

రేపు ఇసుక వేలం

రెబ్బెన: సీజ్ చేసిన ఇసుక కుప్పలను శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు తహసీల్దార్ రామ్మోహన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గొల్లగూడ శివారులోని రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి సమీపంలో 200 ట్రాక్టర్ ట్రిప్పులు, దేవులగూడలోని ధర్మకాంట వెనుకల 80 ట్రిప్పులు, గోలేటి ఎక్స్‌రోడ్ సమీపంలోని పాత సిరామిక్స్ కంపెనీలో 14 ట్రిప్పులు, రాళ్లపేట రైల్వేస్టేషన్ దగ్గరలో 50 ట్రిప్పులు, రాళ్లపేట రైల్వేలైన్ వద్ద 25 ట్రిప్పులను వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు.

'కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయండి'

తిర్యాణి: ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పీసీసీ కార్యదర్శి రవళిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 55 వేల ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటుగా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాం నాయక్, బెల్లం వెంకన్న, గౌరయ్య, ఎండీ నిజాం, రాంచందర్, మల్లేశ్ పాల్గొన్నారు.

కదిలిన దండే విఠల్ సైన్యం



తరలివెళ్తున్న దండే విఠల్ సైన్యం

బెజ్జూర్: కాగజ్‌నగర్ పట్టణంలోని వినయ్ గార్డెన్‌లో గురువారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశానికి బెజ్జూర్ మండలంలోని ఆయా గ్రామాల నుంచి దండే విఠల్ సైన్యం తరలివెళ్లింది. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి మంత్రి సీతక్క హాజరవుతున్న సందర్భంలో బెజ్జూర్ మండల దండే విఠల్ సైన్యం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఓటర్లు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. తరలివెళ్లిన వారిలో సామల రాజన్న, జంగిటి మల్లేష్, రంగు సురేశ్, సల్మాన్, షణ్ముఖ పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి



ప్యాడ్, పెన్నులు పంపిణీ చేస్తున్న సంతోష్

ఇంద్రవెల్లి: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని హైమన్‌డార్ఫ్ బెట్టి ఎలిజబెత్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దుర్వ సంతోష్ అన్నారు. గురువారం మండలంలోని ముత్నూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే ఒక లక్ష్యంతో కష్టపడి చదవాలన్నారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి మాను కుమార్, ఉపాధ్యాయులు మెస్రం రవీందర్, గారుశే కిరణ్, నరేశ్, వెంకటేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



సూచనలు చేస్తున్న డీఎల్‌పీవో ఫణీంధర్

సిరికొండ: పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనపర్చి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని మండల ప్రత్యేకాధికారి డీఎల్‌పీవో ఫణీంధర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాల, జెడ్పీ పాఠశాల్లో పర్యటించిన ఆయన పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. క్రమం తప్పకుండా ప్రత్యేక తరగతులకు హాజరు కావాలన్నారు. అనంతరం జెడ్పీ పాఠశాలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయనతో పాటు ఎంపీడీవో రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు స్లిప్పుల పంపిణీ

సిరికొండ: ఈనెల 27న జరగనున్న ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్‌ల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటర్లుకు ఓటరు స్లిప్పులను మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ తుకారం చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతీ ఒక్క పట్టభద్రుడు ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, బీఎల్‌వో మౌనజ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- ఇంటర్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు
- ప్రణాళికలు రూపొందించిన ఇంటర్‌బోర్డు



కెరమెరి ప్రభుత్వ జూనియర్ కళాశాల



కెరమెరి కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

కెరమెరి: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు కెరమెరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను ప్రత్యేక ప్రణాళికతో సిద్ధం చేస్తున్నారు. విద్యార్థి దశలో ఇంటర్ ఎంతో ప్రాధాన్యమైంది. ఇక్కడ చదువుతున్న వారు మారుమూల గ్రామాలకు చెందిన పేద విద్యార్థులు. మండలంలో మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఐదు ఆశ్రమ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇక్కడ పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒక్కటే దిక్కు. అందుకు కెరమెరిలో పది ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇక్కడి చేరి చదువుకుంటున్నారు. ఇంటర్ బోర్డు ప్రత్యేక జూనియర్ కళాశాల 90 రోజుల ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులను సన్నద్ధం చేస్తోంది. మార్చి 5 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. కెరమెరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇయర్ 118, సెకండ్ ఇయర్‌లో 109 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

ప్రథమ శ్రేణే లక్ష్యం



నేను ఇంటర్ బైపీసీ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాను. ప్రథమ శ్రేణి మార్కులే లక్ష్యంగా ఉదయం సాయంకాలం చదువుకుంటున్నా. సబ్జెక్టుల వారీగా సమయం కేటాయిస్తున్నాం. టీవీ, ఫోను దూరం పెట్టడంతో పాటు అధ్యాపకులు సూచనలు సలహాలు పాటిస్తున్నాను.

– బాదావత్ పద్మావతి, అనార్‌పల్లి

ఉత్తమ ఫలితాలు సాధిస్తాం



నేను సీఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. కళాశాలలో ఉత్తమ మార్కుల సాధనకు ప్రతీ రోజు ఉదయం, రాత్రి పది గంటల వరకు సాధన చేస్తున్నాను. కళాశాల అధ్యాపకుల ద్వారా ముఖ్యమైన ప్రశ్నలతో పాటు ఆన్‌లైన్ ద్వారా పీడీఎఫ్‌లో చూసి పరీక్షలకు సన్నద్ధమవుతున్నా.

– కె ఇందు, బారేమోడి

అధ్యాపకుల సలహాలతో..



నాది అనార్‌పల్లి గ్రామం. కెరమెరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్నా. అధ్యాపకులు సూచిస్తున్న సలహాలు, సూచనలతో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నా. ప్రత్యేక ప్రణాళికతో ప్రతీ రోజు చదువుకుంటున్నా.

– ఆర్. వికాస్, దేవాపూర్

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



ఈఏడాది వందశాతం ఉత్తమ ఫలితాలు సాధనకు ఇంటర్ బోర్డు ఇచ్చిన 90 రోజుల ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం.వార్షిక పరీక్షల కోసం విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

– అస్మత్ అలీ, ప్రిన్సిపాల్, కెరమెరి

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

బెజ్జూర్: బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి అన్నారు. గురువారం మండలంలోని ముంజంపల్లి గ్రామంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం ఆధ్వర్యంలో మండలంలోని పట్టభద్రులను కలుస్తూ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పట్టభద్రులకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు జాడి డిగంబర్, వాసివుల్లా ఖాన్, సీడం సంతోష్, కొల కిష్టయ్య, తిరుపతి పాల్గొన్నారు.

'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలి

తిర్యాణి: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని మండల విద్యాధికారి అంజయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు భయందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

'అపార్' నమోదు వేగవంతం చేయండి

కెరమెరి: అపార్ (ఆటోమేటిక్ పర్మినెంట్ అకాడమిక్ రిజిస్ట్రి) నమోదును వేగవంతం చేయాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మాట్లాడారు. ఎఫ్ఎల్ఎన్ నమోదు పూర్తి చేయాలని, ఎండీఎం మేసేజ్ ప్రతిరోజు విధిగా పెట్టాలని సూచించారు. ఏపీపీ ఆప్‌లో వివరాలు అప్‌లోడ్ చేయాలని, నిర్లక్ష్యం చేస్తే కుదరదన్నారు. కొందరు ఉపాధ్యాయులు రికార్డులు నమోదు చేయడంలో అలసత్వ ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు చంద్రశేఖర్, భరత్‌రావు, ఎస్సీఆర్‌పీలు శ్యాంరావు, నరేశ్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ అశ్విని, సీసీవో మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి



మాట్లాడుతున్న ఎంఈవో హన్మంతు

కౌటాల: ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలను యూడైస్ ప్లస్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో మండలంలోని ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని, అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పిల్లల ఆధార్ వివరాలు, అపార్‌లను యూడైస్ ప్లస్ పోర్టల్‌లో తప్పకుండా ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని సూచించారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం నానాజీ, నారాయణ్‌సింగ్, పాఠశాలల హెచ్‌ఎంలు దుర్గం గోపాల్, చారి తిరుపతి, స్టీవెన్‌సన్, అనిల్ పాల్గొన్నారు.

సీసీఐ బంద్.. ప్రైవేట్ జోరు



సీసీఐ వద్ద క్యూలో పత్తి వాహనాలు

- 11 రోజులుగా పత్తి రైతుల నిరీక్షణ
- సర్వర్ డౌన్‌తో కొనుగోలు చేయని సీసీఐ

కౌటాల: ప్రకృతి వైపరీత్యాలు పత్తి రైతులను పరేషాన్ చేసినా.. ప్రతికూల పరిస్థితుల్లోనూ పంట పండించినప్పటికీ మార్కెట్ ధర లేకపోవడం రైతులను మరింత కుంగదీస్తోంది. కనీసం ప్రభుత్వ మద్దతు ధర చెల్లించే సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)లో గత 11 రోజుల నుంచి పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులకు రోడ్డుపైనే పడిగాపులు పడుతున్నారు. పత్తి రైతులకు అదనపు చార్జీలు చెల్లించి రోజుల తరబడి వాహనాలను క్యూలో నిలబెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. సీసీఐ కొనుగోలు నిలిచిపోవడంతో రైతులు తమ పెట్టుబడి అవసరాల కోసం తక్కువ ధరకే పత్తిని అమ్ముకోవాల్సిన పరిస్థితి. మరోవైపు నేటి నుంచి సీసీఐ కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభిస్తారని సోషల్ మీడియాలో ప్రకటనలతో రైతులు మళ్లీ సీసీఐ కేంద్రాలకు వాహనాల్లో పత్తి తరలించిందేకు సిద్ధమవుతున్నారు.

11 రోజులుగా..

ఈ ఏడాది పత్తి సాగు చేసినా రైతులకు మొదటి నుంచే కష్టాలు వెంటాడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 3.40 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఆరుగాలం శ్రమించినా పంట ఆశాజనకంగా కనిపించ లేదు. అనావృష్టి కారణంగా పత్తి దిగుబడి సైతం తగ్గింది. పత్తికి మద్దతు ధర అధికంగా లేకపోవడంతో రైతులు మొదటి, రెండో తీత పత్తిని ఇళ్లల్లోనే నిల్వ ఉంచారు. ఇక ధర పెరగదని నిర్ణయించుకొని సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయించేందుకు వచ్చిన రైతులకు సీసీఐ సర్వర్ మొరాయించడంతో తిప్పలు తప్పడం లేదు. గత 11 రోజులుగా సీసీఐ కేంద్రాల వద్దనే రైతులు నిరీక్షిస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం..

సీసీఐలో ఆధార్ సర్వర్ మొరాయించడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. సీసీఐలో కొనుగోలు నిలిపివేసిన విషయంపై రైతులకు అవగాహన కల్పించడంతో సీసీఐ, మార్కెటింగ్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పత్తి కొనుగోళ్లు నిలిపివేయడంతో ఎం చేయాలో తోచక రైతులకు తక్కువ ధరకు పత్తిని దళారులకు కట్టబెడుతున్నారు. జిన్నింగ్ మిల్లుల్లో పత్తి నిల్వలు పేరుకుపోయాయని తరచూ సెలవులు ప్రకటించస్తుండడం, ఇలా ప్రతి దానికి పత్తి కొనుగోలు నిలిపివేయడం వల్ల రైతులు పత్తిని అమ్ముకోవడానికి నానా పాట్లు పడుతున్నారు. సీసీఐ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు, జిన్నింగ్ మిల్లు నిర్వాహకులు కుమ్మక్కై అక్రమంగా పత్తిని సీసీఐకి అమ్ముతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

పత్తి కొనుగోళ్లు చేస్తాం

పత్తి కొనుగోలు విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటాం. సర్వర్‌లో ఎలాంటి సమస్య లేకుంటే శనివారం నుంచి పత్తి కొనుగోళ్లను పూర్తిస్థాయిలో ప్రారంభిస్తాం. రైతులు ఆందోళన చెందవద్దు. నేడు పత్తి కొనుగోళ్ల విషయంలో పత్రిక ప్రకటన విడుదల చేస్తాం.

– అశ్ఫక్ అహ్మద్,
ఏడీ, మార్కెటింగ్‌శాఖ, ఆసిఫాబాద్

దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి



నిరసన తెలుపుతున్న వీవోఏలు

ఆసిఫాబాద్‌రూరల్: వీవోఏపై దాడి చేసిన వ్యక్తి వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ అన్నారు. గురువారం వీవోఏలతో కలిసి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. దహెగాం మండల కేంద్రంలో మండల సమ్మాఖ్య కార్యాలయం గ్రూప్ సభ్యుల సమావేశం నిర్వహిస్తుండగా గ్రూప్ సభ్యురాలు భర్త వచ్చి సీసీ, ఉన్న ఏ కారణం లేకుండా వీవోఏపై దాడి చేశాడని ఆరోపించారు. కార్యక్రమంలో ఐకేపీ వీవోఏలు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రోజా, ధనరాజ్, సంతోష్, తిరుపతి, వనిత పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో చోరీ



వివరాలు తెలుసుకుంటున్న సీఐ స్వామి, ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గంగాపూర్ శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగ చొరబడి హుండీని పగలగొట్టి అందులోని నగదును ఎత్తుకెళ్లాడు. వివరాల్లోకి వెళితే.. బుధవారం రోజు మాదిరిగానే ఆలయ పూజారీ పూజా కార్యక్రమాలు ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో గర్భాలయ తలుపులతో పాటు ఆలయ ముందు ఉన్న గేట్లకు తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. అయితే అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఆలయానికి ఉత్తరం వైపు ఉన్న గేట్ తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించి ఆలయం ముందు భాగంలో ఉన్న హుండీ తాళం పగలగొట్టి అందులో ఉన్న నగదును ఎత్తుకెళ్లాడు. ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో ఈ దృశ్యాలన్నీ రికార్డు అయ్యాయి. గురువారం ఉదయం ఆలయ పూజారీ గమనించి ఆలయ ఈవో బాపిరెడ్డికి, పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న రెబ్బెన సీఐ బుద్దె స్వామి, ఎస్సై డి. చంద్రశేఖర్‌లు దొంగ ఆలయంలోకి ప్రవేశించిన మార్గం, పగలగొట్టిన హుండీని పరిశీలించారు. అనంతరం ఆలయంలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించారు. దుండగుడి ఆచూకీని తెలుసుకుని ఆసిఫాబాద్ నుండి క్లూస్ టీంలు పిలిపించారు. క్లూస్ టీం సిబ్బంది ఆలయంలో దొంగకు సంబంధించి వేలిముద్రలు, ఇతర ఆధారాలు సేకరించారు. అయితే ఇటీవలే ఆలయంలో జరిగిన స్వామి వారి జాతర సందర్భంగా హుండీ లెక్కించడంతో పెద్ద మొత్తంలో చోరీకి గురికాలేదని ఈవో తెలిపారు. సుమారు రూ. 1000 వరకు హుండీలో నగదును దొంగ ఎత్తుకెళ్లి ఉంటాడని అంచనా వేస్తూ పోలీసులకు ఫిర్యాదు అందించడంతో కేసు నమోదు చేసిన పోలీసులు దొంగ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

రాత్రి విధుల్లో లేని వాచ్‌మెన్..

ఆలయం వద్ద కాపలాగా ఉండాల్సిన నైట్ వాచ్‌మెన్ బుధవారం రాత్రి విధులకు హాజరు కాలేదు. అయితే ఆలయంలో పురాతనమైన, విలువైన పంచలోహాలతో చేయబడిన ఆలివేల మంగ, పద్మావతి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలు ఉన్నాయి. గతంలోనూ ఈ విగ్రహాలు చోరీకి గురి కాగా అదృష్టవశాత్తు పట్టుబడ్డాయి. అప్పటి నుండి ఆలయంలో నైట్ వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేశారు.

పక్కా భవనాలు కరువు..!

- అద్దె భవనాల్లోనే కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, అధికారులు



పాఠశాల భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

లింగాపూర్: పాలనా సౌలభ్యం కోసం గత ప్రభుత్వం మండలాలు ఏర్పాటు చేసినా.. ప్రభుత్వ కార్యాలయాలకు అద్దె భవనాలే దిక్కుఅయ్యాయి. సిర్పూర్(యూ) నుంచి విడిపోయి లింగాపూర్ మండలం ఏర్పాడి దాదాపు ఎనిమిది ఏళ్లు అవుతున్నా.. నేటికి ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించలేదు. దీంతో వివిధ పనుల కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తహసీల్దార్, ఎంపీడీవో, మండల సమాఖ్య కార్యాలయాలకు పక్కా భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు.

స్థలాల పరిశీలన..

మండలంలో తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించేందుకు జిల్లా అధికారులు పర్యటించి పలు ప్రభుత్వ భూములను పరిశీలించారు. కానీ నేటికి భవన నిర్మాణాలు చేపట్టలేదు. ప్రస్తుతం మండల కేంద్రంలోని పాత ప్రభుత్వ పాఠశాల భవనంలో తహసీల్దార్ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. ఎంపీడీవో కార్యాలయాన్ని పంచాయతీ భవనంలో, మహిళా సమాఖ్య కార్యాలయాన్ని శిథిలావస్థకు చేరిన ఆసుపత్రిలో కొనసాగిస్తున్నారు. కాగా ఆయా భవనాల్లో సరిపడా గదులు లేక, మరుగుదొడ్లు లేక ప్రజలు, అధికారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాలకు ప క్కా భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

భవనాలు నిర్మించాలి



మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు తాత్కాలిక భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఆయా భవనాల్లో సరైన సౌకర్యాలు లేక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు చాలా ఇబ్బంది అవుతుంది. అధికారులు స్పందించి కొత్త భవనాలు నిర్మించాలి. – జాటోత్ రాహుల్,లింగాపూర్

కాకతీయ హోటల్ భోజనంలో పురుగులు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని పెట్రోల్‌పంపు ఏరియాలో గల కాకతీయ మెస్‌లో గురువారం భోజనం చేసేందుకు వెళ్లిన పలువురికి పురుగులు కనిపించాయి. దీంతో కాకతీయ హోటల్ యాజమాని రాజేంద్రప్రసాద్‌ను ప్రశ్నించగా, ఆయన దురుసుగా ప్రవర్తించాడని పేర్కొన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేయకపోవడంతోనే ఇష్టారాజ్యంగా హోటల్ యాజమానులు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపించారు.

విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి

- డీఈవో గమానియల్



మాట్లాడుతున్న డీఈవో గమానియల్

రెబ్బెన: పదో తరగతి విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ఏకాగ్రతతో చదవాలని డీఈవో గమానియల్ అన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను గురువారం సందర్శించారు. గంగాపూర్ పాఠశాల విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలపై సూచనలు, సలహాలు అందించారు. కష్టపడి చదివి మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అబ్దుల్ లతీఫ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల ధర్నా



ఖాళీ బిందెలతో బైఠాయించిన మహిళలు

దహెగాం(సిర్పూర్): తాగు నీటి కి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ఎస్సీ కాలనీకి 15 రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో అవస్థలు పడుతున్నామని తెలిపారు. నీటి కోసం కూలీ పనులను కూడా వదులుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన అధికారులు తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.